www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 12 అక్టోబర్ 2024

5



వైఎస్ఆర్

పల్లెబాట పట్టిన అటవీ శాఖ సిబ్బంది

ప్రజాశక్తి - సిద్ధవటం : అటవీశాఖ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అటవీ శాఖ సిబ్బంది పల్లె బాట పట్టారు. అటవీ ప్రాంతం నుంచి కొండ సంపద తరలిపోకుండా అటవీ క్షేత్ర అధికారి కళావతి పర్యవేక్షణలో అణువణువునా రాత్రిం బవళ్లు సిబ్బంది క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్న విషయం విధితమే. శుక్రవారం మండల పరిధిలోని ఎస్.రాజంపేట, జ్యోతి, వంతాటి పల్లె గ్రామాల్లో ప్రజలకు అటవీ శాఖ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజర్ కళావతి మాట్లాడుతూ వన్యప్రాణులవేట, ఎర్రచందనం అక్రమ రవాణాలను అడ్డుకోవడంలో అటివి శాఖకు సహకరించాలని ఆ ప్రాంత ప్రజలను ఆమె కోరారు మీ గ్రామాల్లో కొత్త వ్యక్తులు, వాహనాలు, ఎవరైనా అనుమా నాస్పదంగా అనిపిస్తే వెంటనే అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె.ఓబులేసు, ఎఫ్‌బిఒ, పెంచల రెడ్డి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు

సాగునీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు



కడపలో 206, అన్నమయ్యలో 94 సంఘాలు

16న ఎన్నికల నోటిఫికేషన్..?

సభ్యత్వ నమోదుపై మల్లగుల్లాలు

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ కసరత్తు ఊపందుకుంది. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన నీటిపారుదల శాఖ జిల్లా అధికార యంత్రాంగాలు ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించాయి. చెరువుల వారీగా ఎన్నికల అధికారుల నియామకంపై దృష్టి సారించాయి. ఉమ్మడి జిల్లాలకు చెందిన 300 చెరువుల కింద పంటలు సాగుచేస్తున్న రైతుల సభ్యత్వ నమోదు దగ్గర నుంచి ఎన్నికల అధికారుల నియామకం, ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించడం తదితర అంశాలపై దృష్టి సారించింది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లాలో 206, అన్నమయ్య జిల్లాలో 94 సాగునీటి సంఘాలు ఉన్నాయి. కడప జిల్లా సాగునీటి పారుదల శాఖ పరిధిలో ఆరు ఇరిగేషన్ సర్కిల్స్ పరిధిలోని మైనర్ 112, మీడియం 16, మేజర్ 78 వెరసి 206 సాగునీటి సంఘాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద 94 సాగునీటి సంఘాలు ఉండడం గమనార్హం. 2015లో అప్పటి టిడిపి సర్కారు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం తెలిసిందే. సుమారు పదేళ్లుగా సాగునీటి సంఘాలు మనుగడలో లేకపోవడంతో రైతుల్లో ఉత్సాహం కొరవడి నట్లు కనిపిస్తోంది.

నోటిఫికేషన్‌పై అధికారుల దృష్టి

ఈ నెల 16న సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ఆయా మండలాల వారీగా చెరువుల వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. చెరువుల జాబితా రూపకల్పన చేసిన అనంతరం ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజినీరింగ్ స్థాయి అధికారులను నియామకాలను పూర్తి చేశారు. వీరికి అనుబంధంగా ఆయా మండలాలకు చెందిన తహశీల్దార్ స్థాయి అధికారుల నియామకం చేపట్టాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. వీరికి అనుబం ధంగా అదనపు సిబ్బందిని నియమించాల్సి ఉంది.

సభ్యత్వం..సంసిద్ధం..

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల దగ్గర నుంచి ఆయా చెరువుల పరిధిలో సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టడంపై దృష్టి సారించాల్సి ఉంది. ఆయా చెరువుల పరిధిలోని సాగు విస్తీర్ణాన్ని బట్టి వందలాది మంది రైతులు ఉన్న సంగతి తెలిసిందే. వీరందరూ సభ్యత్వ నమోదు చేయడానికి ముందు ఎకరాకు రూ.200 చొప్పున నీటి పన్ను చెల్లించడం మొదలగు నిబంధనలను పాటించాల్సి ఉంది. రెండేళ్లుగా వర్షాలు లేక పంటలు పండని నేపథ్యంలో ఎంతమంది రైతులు సభ్యత్వ నమోదుకు ముందుకొస్తారనే అంశంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. సభ్యత్వ నమోదుకు ముందుకు వచ్చిన వారితోనే ఎన్నికల తంతు నిర్వహించాలనే ఉద్దేశంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికార యంత్రాంగాలు సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించడం, ఎన్నికలు నిర్వహించడం, ఫలితాలు ప్రకటన చేయడంపై దృష్టి సారించినట్లు కనిపిస్తోంది.

పారదర్శక ఎన్నికలు సాగేనా!

2015లో నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికల ఫలితాల ప్రకటనలో పారదర్శకత కొరవడిన సంగతి తెలిసిందే. అప్పటి సాగునీటి సంఘాల ఎన్నికలను అధికార పార్టీ మెజార్టీ సంఘాలను ఏకగ్రీవం చేసుకుందనే ఆరోపణల ఉన్నాయి. ఒంటిమిట్ట సాగునీటి సంఘ ఎన్నికపై ప్రత్యర్థులు కోర్టును ఆశ్రయించిన ఘటనలు ఉన్నాయి. తాజా సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణలో గత అప్రజాస్వామిక పోకడలు పునరావృతం గాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించాం

జిల్లాలో సాగునీటి సంఘాలకు ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించాం. చెరువుల వారీగా జాబితా సేకరణ దగ్గర నుంచి ఇరిగేషన్ అధికారులను నియమించడమైంది. కలెక్టర్ ఆదేశాల అనంతరం ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తాం.

- కె.శ్రీనివాసులు, ఎస్ఇ, ఇరిగేషన్, కడప.

ఇక ప్రయివేట్ మద్యం షురూ!



జిల్లాలో 139 మద్యం షాపులు

3,169 దరఖాస్తులు స్వీకరణ

రూ.63.38 కోట్ల ఆదాయం

14న దుకాణాలకు లక్కీడ్రా

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో నూతన మద్యం పాలసీ అమలుకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 14న జడ్పీ ఆవరణంలో కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడ్రా తీయడం ద్వారా దుకాణ కేటాయింపు ఏర్పాట్లలో ఎక్సైజ్ యంత్రాంగం నిమ గ్నమైంది. జిల్లాలోని కడప, సిద్ధ వటం, బద్వేల్, మైదుకూరు, ప్రొద్దుటూరు, ముద్దనూరు, జమ్మలమడుగు, పులి వెందుల, యర్రగుంట్ల ఎక్సైజ్ స్టేషన్లు అలుపెరగకుండా శ్రమిస్తున్నాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ల ద్వారా జిల్లాలోని 139 దుఖాణాలకు దరఖాస్తుల స్వీకరణ మొదలుకుని డిడిలు, చలనాల పరిశీలన, లక్కీడ్రా నిర్వహణ, ఇతర పాలనా వ్యవహారాల్లో తీరిక లేని పరిస్థితి కనిపిస్తోంది. ఈనెల ఒకటి నుంచి నూతన మద్యం పాలసీ అమలు ప్రక్రియలో భాగంగా మద్యం దుకాణాలకు దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మాద్యమాల ద్వారా స్వీకరించింది. శుక్రవారం రాత్రి పొద్దుపోయే సమయానికి సుమారు 3,169 దరఖాస్తులను స్వీకరించింది. ఒక్కో దరఖాస్తుకు రూ.రెండు లక్షల చొప్పున సుమారు రూ.63.38 కోట్లు వరకు సమకూర్చు కుంది.

ప్రజారోగ్యానికి పాతర

ప్రభుత్వం భారీగా ఆర్జించాలనే ఉద్దేశంతో ముందుకు వెళ్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయాల్లో వైసిపి సర్కారు నాసిరకమైన మందును అందుబాటులో ఉంచి, పేదల రక్తాన్ని తాగుతోందని తాము అధికారంలోకి వస్తే నాణ్యమైన మందును అందుబాటులో ఉంచుతామని హామీల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం నూతన మద్యం పాలసీ పేరుతో ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది లక్షల పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లో చిచ్చు రాజేస్తోంది. ప్రభుత్వ మద్యం దుకాణ పాలసీని రద్దు చేసి నూతన మద్యం పాలసీని రూపకల్పన చేసింది. ప్రయివేటు వ్యక్తులకు దుకాణాలను కట్టబెట్టి, ఊరికి రెండు, మూడు అక్రమ బెల్టు షాపుల ద్వారా జిల్లా ప్రజలను తాగుబోతులను చేసి భారీగా ఆర్జించాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతోందనే విమర్శ వినిపిస్తోంది.

నేతలపై ఒత్తిళ్లు!

నూతన మద్యం పాలసీ అమలు దగ్గర నుంచి అధికార పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకుల నుంచి ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెరుగుతోంది. వైసిపి ప్రభుత్వ హయాంలో జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో సర్వస్వాల్ని ధారపోసి ఎదురొడ్డి పనిచేశామనే పేరుతో మద్యం దుకాణాలు దక్కేలా చూడాలని కోరుతున్నారు. గత వైసిపి సర్కారు దశల వారీగా మద్యం దుఖాలను తగ్గిస్తామనే పేరుతో భారీగా మద్యం ద్వారా ఆదాయన్ని ఆర్జించిన సంగతి తెలిసిందే. 2014-19 టిడిపి హయాంలో రాష్ట్రంలో మద్యం విక్రయాల ఆదాయం రూ.12 వేల కోట్లు కాగా, 2019-2024 వైసిపి హయాంలో రూ.24 వేల కోట్లు ఆర్జించిన సంగతి తెలిసిందే. తాజా ప్రభుతం ఇదేబాట పడుతోంది. టిడిపి కార్యకర్తల ఒత్తిడి తట్టుకోలేక జిల్లాలోని ప్రజాప్రతినిధులు సిండికేట్ ప్రయత్నాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

14న డ్రా ద్వారా కేటాయింపులు

జిల్లాలోని 139 మద్యం దుకాణాల కేటాయింపు ఏర్పాట్లపై ఎక్సైజ్ జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణంలో కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా విధానం ద్వారా కేటాయింపులు చేయనున్నారు. అనంతరం 16 నుంచి దుకాణాలు దక్కించుకున్న దరఖాస్తుదారులు మద్యం దుకాణాలు నిర్వహణకు అనుమతులు ఇవ్వనున్నామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవి కుమార్ పేర్కొనడం గమనార్హం.



విలేకర్లతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ చెన్నారెడ్డి

16 మద్యం షాపులకు 389 దరఖాస్తులు

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

పులివెందుల మండలానికి సంబంధించి 16 మద్యం షాపులకు 389 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సిఐ చెన్నారెడ్డి, జిల్లా టాస్క్‌ఫోర్సు సిఐ విశ్వనాథ్‌రెడ్డి అన్నారు.ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గం లోని 16 మద్యం షాపులకు సంబంధించి 389 దరఖాస్తులు వచ్చాయన్నారు. పులివెందుల 151 , వేంపల్లి 131, వేముల 19, లింగాల 31,చక్రాయపేట 27 దరఖాస్తులు వచ్చాయన్నారు.. దరఖాస్తుల అన్నిటికీ ఈనెల 16న కడపలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో డ్రా తీస్తారని తెలిపారు. లక్కీ డిప్ లాటరీ ఎవరు తగిలితే వారికి మద్యం షాపులు ఇస్తారని పేర్కొన్నారు.

ఎపి దర్శన్ విజయవంతం

ప్రజాశక్తి - కడప అర్బన్

కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆధ్వర్యంలో విజన్ స్వర్ణ ఆంధ్ర-2047లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న 182 మంది విద్యార్థులు , 486 మంది విద్యార్థినులు, ఉప విద్యా శాఖ అధికారి, 50 మంది గైడ్ టీచర్స్ ల బృందం ఆంధ్ర ప్రదేశ్ దర్శన్ , కడప నుంచి అరకు వరకు అనే విద్యా విజ్ఞాన విహార యాత్రను ఈ నెల 4 వెళ్లారు. శుక్రవారం ఈ యాత్ర విజయవంతమైంది. మొదటి రోజు కడప నుంచి బయలు దేరిన బృందం 4న రాత్రి శ్రీ కాళహస్తికి చేరుకుని ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలులో ఏర్పాటు చేసిన వసతి గృహాల్లో బస చేశారు. 5న శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి దర్శనం అనంతరం శ్రీ హరి కోట లో మిషన్ కంట్రోల్ సెంటర్ , రాకెట్ లాంచింగ్ ప్యాడ్ 1,2ను సందర్శించారు. చిలకలూరిపేట లోని ఎఎంజి ఇంటర్నేషనల్ హైస్కూల్ లో బస చేశారు. కొండవీడు కోటలో రెడ్డి రాజుల నిర్మించిన కోటను ,అమరావతిలో అమర లింగేశ్వర స్వామి దేవాలయం,బౌద్ధ మ్యూజియం, అమరావతి స్థూపం లను సందర్శించారు. పిఠాపురం లో కుకటేశ్వర స్వామి దేవాలయం పరిసర ప్రాంతాలలను సందర్శించారు. రాత్రి శంఖవరంలో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నవరంలో శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయంను సందర్శించి విశాఖపట్నం చేరుకున్నారు. కైలాసగిరి, సబ్ మెరైన్ మ్యూజియం, ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియం, రామ కృష్ణ బీచ్‌ను సందర్శించారు. సింహాచలంలోని శ్రీ సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. సింహాచలం నుంచి బొర్రా గృహాలకు వెళ్లారు. వివిధ రకాల కళాఆకృతులు పరిశీలించి అనంతరం అరకు బయలుదేరి వెళ్లారు. రాత్రికి అరకులో మ్యూజియంను సందర్శించారు. వివిధ రకాల ఉద్యానవనాలు, వ్యూ పాయింట్లు సందర్శించారు. విజయవాడలోని అంబేద్కర్ విగ్రహం, అంబేద్కర్ మ్యూజియంను విద్యార్థులు సందర్శించారు. అంబేద్కర్ జీవిత విశేషాలు, రాజ్యాంగం సంబంధించిన విషయాలు తెలుసుకోవడంతో పాటు విద్యార్థుల తమ అభిప్రాయాలను కూడా తెలియజేశారు. అంబేద్కర్ విగ్రహం సందర్శన అనంతరం విజయవాడ నుంచి బయలుదేరి 8వ రోజు ఉదయం 10 గంటలకు విద్యార్థులను వారి వారి గమ్య స్థానాలకి గైడ్ టీచర్ల ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారులకు, పాఠశాల ప్రధానో పాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అప్పగించారు. **కలెక్టర్‌ను జీవితాంతం గుర్తుంచుకుంటాం..** విజ్ఞానంతో కూడిన విహారయత్రకు పంపించి తమలో నూతన ఉత్సాహాన్ని కలిగించిన కలెక్టర్ శివశంకర్ లోతేటి కి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నామని 'ఏపీ దర్శన్' (విజ్ఞాన విహారయాత్ర)కు వెళ్లి వచ్చిన విద్యార్థులు ముక్తకంఠంతో అన్నారు. వారం రోజుల పాటు రాష్టంలోని వివిధ ప్రదేశాలను కడప నుంచి అరకు వరకు సంతోషంగా సందర్శించి 500 మంది పదో తరగతి విద్యార్థులు శుక్రవారం కడపకు చేరుకున్నారు.



శ్రీహరికోట సందర్శనలో విద్యార్థినులు

కర్నూలు జట్టుపై విశాఖ విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్-14 ప్లేట్ గ్రూప్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై ఇన్నింగ్స్ 119 పరుగుల తేడాతో విశాఖపట్నం ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 63 పరుగులు చేసింది. విశాఖపట్నం జట్టు 295 పరుగులు చేసింది. చివరి రోజు రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 44.3 ఓవర్లలో 113 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి చెందింది. ఆ జట్టులోని బి.వి.ఎస్. శ్రీవాస్తవ 51, పాల్ సుదర్శన్ 26 పరుగులు చేశారు. విశాఖపట్నం జట్టులోని భాను స్వరూప్ అద్భు తంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. వినోద్ 3 వికెట్లు తీసుకున్నాడు.

కెఎస్ ఆర్ ఎం క్రికెట్ మైదానంలో కడప, ఈస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్ లో మొదటి ఇన్నింగ్స్‌లో ఈస్ట్ గోదావరి జట్టు 151 పరుగులు చేసింది. ఐదు వికెట్ల నష్టానికి 159 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90.0 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 320 పరుగులు చేసింది. ఆ జట్టులోని సాయి కృష్ణ చైతన్య 129 పరుగులు (సెంచరీ) చేసి నాటౌట్‌గా నిలిచాడు. తాహిర్ 40 పరుగులు చేశాడు. ఈస్ట్ గోదావరి జట్టులోని తమన్ మూడు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన ఈస్ట్ గోదావరి జట్టు ఆట ముగిసే సమయానికి 51.0 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. ఆ జట్టులోని కార్తీక్ 64, కృష్ణ సాకేత్ రెడ్డి 53 పరుగులు చేశారు. కడప జట్టులోని హితేష్ సాయి మూడు వికెట్లు తీసుకున్నాడు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా మొదటి ఇన్నింగ్స్ లో కడప జట్టు ఆధిక్యత సాధించింది.

వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో చిత్తూరు, ప్రకాశం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్ లో మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 407 పరుగులు చేసింది. చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ప్రకాశం జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 70.4 ఓవర్లలో 165 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. దీంతో చిత్తూరు జట్టు ఫాలో ఆన్ ప్రకటించింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన ప్రకాశం జట్టు ఆట ముగిసే సమయానికి 27.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 88 పరుగులు చేసింది. మ్యాచ్ రాగా ముగిసింది. కాగా చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో ఆధిక్యత సాధించింది.



తలపడుతున్న చిత్తూరు, ప్రకాశం జట్లు



సమావేశంలో మాట్లాడుతున్న అన్వేష్

పేదలకు భూ పంపిణీ చేయాలి : వ్య.కా.స

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

పెన్నాపేరూరులోని జోకులపల్లె ప్రభుత్వ భూమలను పేదలకు పంపిణీ చేయాలని వ్యవసాయ జిల్లా కార్యదర్శి వి. అన్వేష్, మండల కార్యదర్శి నరసయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ 12 సంవత్సరాల నుంచి పేదలు భూ పంపిణీకి నోచుకోలేదన్నారు. 12 ఏళ్లల్లో రెవెన్యూ అధికారులతో లాలూచీపడి రాజకీయ నాయకులు, పలుకుబడి కలిగిన వారు, డబ్బున్న వారు అనర్హులు పెద్ద ఎత్తున భూములు లబ్ధి పొందారని పేర్కొన్నారు. వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పంపిణీ చేయాలని పేర్కొన్నారు. అసైన్‌మెంట్ చట్టాన్ని ఉల్లంఘించి ఇష్టాను సారంగా పట్టాలు ఆన్‌లైన్‌లో ఎక్కించారని, జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెన్నా పేరూరు రెవెన్యూ పొలంలో ఏడో విడతలో అసైన్‌మెంట్ కమిటీలో ఆమోదం పొందిన లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలన్నారు. లేకపోతే గ్రామీణ ప్రాంతాలల్లోని పేదలను కలుపుకొని ఆ ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం నాయకులు ప్రసాద్, నరసింహ, రామచంద్రుడు, సాంబయ్య, సురేష్ బాబు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో కేంద్ర ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - కడప

నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విషయంలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండి సుమంత్ కుమార్ అన్నారు. శుక్రవారం ఇండియన్ యూత్ కాంగ్రెస్ ముద్రించిన 'నౌక్రీ దో, నషా నహీ' పోస్టర్లను కడప నగరంలోని యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బండి సుమంత్ కుమార్ అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం ఉద్యోగాల విషయం గాలికి వదిలేసి కేవలం మాదకద్రవ్యాలు, డ్రగ్స్‌నుఏరులై పారేటట్లు చేస్తు యువతను నాశనం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల వ్యాపారానికి వ్యతిరేకంగా డ్రగ్స్ వద్దు ఉద్యోగం ముద్దు అని ఇండియన్ యూత్ కాంగ్రెస్ నిర్వహించిన దేశవ్యాప్త క్యాంపెయిన్ యువత గళాన్ని వినిపించి బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మోడీ సర్కార్ నిరుద్యోగుల పట్ల అవలంభిస్తున్నటువంటి మొండి వైఖరిని నిరసిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విషయంలో విఫలమైన బిజెపి ప్రభుత్వాన్ని ఎండ కొడుతూ జరగబోయే నౌకరీ దేవ్ నాషా నహి చలో ఢిల్లీ కార్యక్రమానికి అధిక యువత తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పొద్దుటూరు అసెంబ్లీ అధ్యక్షుడు వంశీ యాదవ్, కమలాపురం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శివప్రసాద్, జమ్మలమడుగు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంధం సునీల్ కుమార్, సాయి, చక్రి పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ యూత్ నాయకులు బండి సుమంత్‌కుమార్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా ఇంటర్మీడియెట్ ఆర్‌జెడి (రీజనల్ జాయిన్ డైరెక్టర్) రవిపై వస్తున్న అవినీతి ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. శుక్రవారం ఆర్‌టిసి బస్టాండ్ వద్దనున్న జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిగ్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కడప ఇంటర్ ఆర్‌జెడిగా ఉన్న రవిపై అనేక సందర్భాలలో అవినీతి ఆరోపణలు వస్తునేవున్నాయన్నారు. ఆయన అధికార అండ, బలంతో మేనేజ్ చేసుకుంటూ ఇంతకాలం వచ్చారని పేర్కొన్నారు. కొద్ది రోజులుగా అక్రమ బదిలీల్లో, ప్రమోషల్లలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో ఇతను ఆర్ఐఒగా ఉన్న సందర్భంలో ప్రయివేటు కళాశాలలకు అండగా నిలబడుతూ వచ్చారన్నారు. అధికారులు ఒక కమిటీ వేసి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నగర కన్వీనర్ విజయ్,నాయకుడు వంశీ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి -కడప అర్బన్

ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని ఎపిటిఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ సి.వి ప్రసాద్ కోరారు. శుక్రవారం కడప ఎపిటిఎఫ్ అమరావతి కార్యాలయంలో రాష్ట్ర సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ డిఎ, పిఆర్‌సి బకాయిలన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్ బకాయిలు సకాలంలో జమ కాక పోవడంతో వడ్డీ నష్టపోతున్నామని తెలిపారు. సిపిఎస్ నగదు బకాయిలు చెల్లంపులో జాప్యం జరుగుతున్నా, వేతనాల్లో సిపిఎస్ తగ్గింపులు ఆగలేదన్నారు. 2023- 24 సిపిఎస్ మ్యాచింగ్ గ్రాంట్ వెంటనే ప్రాన్ ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. నెలల పాటు మెడికల్ బిల్లుల చెల్లింపులు పెండింగ్ ఉండడం దారుణం అన్నారు. వైద్యం నిమిత్తం ఈహెచ్ఎస్ అనుమతి ఆలస్యాన్ని నివారించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ 5 ఏళ్లకు కచ్చితంగా పిఆర్‌సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంపాదిత సెలవుల నగదు చెల్లింపులు చేయాలని కోరారు. వేతన బకాయిలు చెల్లింపులు సరళీకృతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎపిటిఎఫ్ అమరావతి నాయకులు వీరప్రసాద్, పద్మజా, చంద్రశేఖర్ రెడ్డి, రాజగోపాల్ పాల్గొన్నారు.

రాయితీపై నిత్యావసర సరుకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

నిత్యావసర, కూరగాయల ధరలు మండిపోతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు రాయితీతో పంపిణీ చేస్తోంది. ముఖ్యంగా తెల్లరేషన్‌కార్డులున్న ప్రతి ఒక్కరికీ వంట నూనె, టమోటాలు, ఎర్రగడ్డలు రాయితీపై అందిస్తోంది. పామ్ ఆయిల్ రూ.110, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ. 124 అందిస్తోంది. ఒక్కో కార్డుపై నూనె మూడు లీటర్లు, ఇస్తున్నారు. కిలో టమోటా పై కిలో రూ.15 నుంచి 20 వరకు, ఎర్రగడ్డలు కిలో రూ.35 పంపిణీ చేస్తున్నారు. వీటిని రైతు బజార్‌లో విక్రయిస్తున్నారని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



శనగలు పంపిణీ చేస్తున్న మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి

శనగలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వం రాయితీతో ఇస్తున్న శనగలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశి భూషణ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని అంకాలమ్మ గూడూరులో ప్రభుత్వం రాయితీతో ఇస్తున్న శనగలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటుందన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతుకూ రాయితీ శనగలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శివ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సర్డ్ సొసైటీ సభ్యులు

లింగ వివక్ష తగదు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

లింగ వివక్షను పాల్పడే చట్టాన్ని వ్యతిరేకించి జైలు పాలు కావద్దని వైద్యాధికారి డాక్టర్ బద్వేలి శివప్రసాద్ రెడ్డి అన్నారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని అనిబిసెంట్ మున్సిపల్ స్కూల్ ఆవరణలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిసిపి ఎన్‌డిటి చట్టం 1994పై అవగాహన కల్పించారు. కూతురు అంటే భారం కాదు. వరం అన్నారు. ఆడ అయినా మగ అయినా ఇద్దరు ఒకటే అన్నారు. చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ పరీక్షలు చేసినవారికి, చేయించిన వారికి, అందుకు సహకరించిన వారికి మూడు నుండి ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు జరిమానా విధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు సుబ్బారెడ్డి కార్యదర్శి సభ్యులు రమణమ్మ, గంగాభవాని, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, స్థానికులు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘానికి ఇవిఎంలపై మోజెందుకో? : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె



మాట్లాడుతున్న తులసిరెడ్డి

దేశంలోని ఆయా రాజకీయ పార్టీలన్నీ పేపర్ బ్యాలెట్ పై ఎన్నికలు జరపాలని కోరుతుంటే ఎన్నికల సంఘానికి మాత్రం ఇవిఎంలపై మోజు పెంచుకోవడం ఎంత వరకు సమంజసమని పిసిసి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఎన్నికల్లో ఇవిఎంలను వాడకుండా పేపర్ బ్యాలెట్నే వాడుతున్నారని చెప్పారు. బంగ్లాదేశ్, కెనడా, ఫిన్లాండ్, ఐర్లాండ్, ఇటలీ, నెదర్లాండ్, నార్వే, పాకిస్తాన్, స్పెయిన్, స్వీడన్ లాంటి దేశాల్లో ఇవిఎంలు వాడి మళ్లీ తిరిగి పేపర్ బ్యాలెట్లతోనే ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2004 వరకు మన దేశంలో కూడా పేపర్ బ్యాలెట్ పైనే ఎన్నికలు జరిగినట్లు చెప్పారు. స్థానిక సంస్థల్లో ఇప్పటికీ పేపర్ బ్యాలెట్‌నే వాడుతున్నట్లు తెలిపారు. ఇవిఎంల ద్వారా శాసన సభ, లోక్‌సభ ఎన్నికలు జరగడాన్ని బిజెపి అగ్రనేతలైన అద్వానీ, సుబ్రమణ్యస్వామి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, టిడిపి అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, వైసిపి అధ్యక్షుడు జగన్‌తో పాటు ఇతర నాయకులు ఏదో ఒక సమయంలో ఇవిఎంలపై అనుమానం వ్యక్తం చేసినవారే అన్నారు. ఇవిఎంలపై విశ్వసనీయత అనేది రాజకీయ పార్టీల్లో, ప్రజల్లో కోల్పోయినట్లు చెప్పారు. విశ్వసనీయత అనేది లేనప్పుడు ప్రజాస్వామ్యానికి విలువ ఉండదని చెప్పారు. కాబట్టి భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో ఇవిఎం స్థానంలో పేపర్ బ్యాలెట్ వాడేలా లేక వివి ప్యాట్ స్లిప్పులు ఓటర్ చేతికి వచ్చి ఓటర్ బాక్స్‌లో వేసేందుకు ఎన్నికల సంఘం కృషి చేయాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

క్రిస్టియన్ భవన్‌కు నిధుల కేటాయింపు హర్షణీయం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

క్రిస్టియన్ భవన్‌కు రూ. 10 కోట్లు కేటాయించడం హర్షణీయమని టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె ప్రసాద్ దాసు, వైస్ ప్రెసిడెంట్ పాలకొల్లు రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక టిడిపి కార్యాలయంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మైనార్టీ శాఖ మంత్రి, అధికారులతో సమావేశమై క్రైస్తవ సమస్యలపై సమీక్ష నిర్వహించారన్నారు. గత టిడిపి ప్రభుత్వం హయాంలోనే క్రిస్టియన్ భవనం నిర్మాణం కోసం రెండు ఎకరాలు కేటాయించి రూ.16 కోట్లు నిధులు విడుదల చేసి భవన నిర్మాణం 90 శాతం పనులు పూర్తి చేశారన్నారు. వైసిపి ప్రభుత్వం రాగానే క్రిస్టియన్ భవనం మూత పడిపోయిందన్నారు. అనేకసార్లు క్రిస్టియన్ భవన్ వద్ద ధర్నాలు నిరసన చేసిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చీమకుట్టినట్టుగా లేదన్నారు. మిగిలిన 10 శాతం పూర్తి చేయలేదన్నారు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ఉన్న కాలంలో క్రిస్టియన్ కార్పొరేషన్ నిర్వీర్యం చేశారని వాపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే క్రైస్తవుల పక్ష విశ్వాసంతో క్రిస్టియన్ భవన్‌కు రూ.10 కోట్ల కేటాయించి పనులు ప్రారంభం చేయాలని ఆదేశించడం సంతోషకరమన్నారు. క్రైస్తవులకు పవిత్ర పుణ్యక్షేత్రము జెరూసలేం యాత్రకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. సిఎంచంద్రబాబు తీసుకున్న నిర్ణయంతో క్రైస్తవ సమాజం హర్షం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో క్రిస్టియన్ సెల్ నాయకులు కుమార్ పాల్గొన్నారు.

అగ్రిసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 28వ ర్యాంక్

ప్రజాశక్తి - ఖాజీపేట



వేమిరెడ్డి లక్ష్మీ భవ్యశ్రీ

ప్రభుత్వం విడుదల చేసిన అగ్రిసెట్ 2024 ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో విద్యార్థిని వేమిరెడ్డి లక్ష్మి భవ్యశ్రీ ఒసి విభాగంలో రాష్ట్ర స్థాయిలో 28వ ర్యాంక్ సాధించి తమ ప్రతిభను చాటింది. ఈమె పదవ తరగతి మైదుకూరులోని మంటిస్సోరి పాఠశాలలో, నంద్యాలలో అగ్రికల్చర్ డిప్లొమా పూర్తి చేసింది. తల్లిదండ్రులు వేమిరెడ్డి చంద్ర ఓబుల్ రెడ్డి, వేమిరెడ్డి నాగ లక్ష్మమ్మ దంపతుల కుమార్తె. వీరి ప్రధాన వృత్తి వ్యవసాయం. తమ కుమార్తె రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు సంతోషం వ్యక్తపరిచారు.

అరటి సాగు.. ఆదాయం బాగు..!

ప్రజాశక్తి -ఖాజీపేట

మండలంలో రైతులు సంప్రదాయ పంటల సాగును తగ్గించి, ఉద్యాన పంటల వైపు అధిక దృష్టి సారిస్తున్నారు. వరి పంట సాగుకు పెట్టుబడి వ్యయం అధికంగా ఉండటం, దిగుబడులు తక్కువ రావడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్ట పోతుండటంతో ఆ పంట సాగు విస్తీర్ణాన్ని తగ్గిస్తున్నారు. కొనేళ్లుగా మండలంలోని పలు గ్రామాల రైతులు ఉద్యాన పంటల సాగు పై దృష్టి పెట్టారు. పసుపు, అరటి, బొప్పాయి వంటి పంటలపై ఆసక్తి పెంచుకుంటున్నారు. కూన వారిపల్లె, కొత్త పేట, కొత్త నెల్లూరు, నాగసాని పల్లె తదితర గ్రామాలలో రైతులు ఎక్కువ ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు. కొత్తపేట పరిసర ప్రాంతాల్లో అరటి పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. మూడేళ్లుగా అరటి టన్ను ధర పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం ఒక్కో టన్ను రూ. 28 వేల నుంచి రూ. 40 వేలు పలుకుతోంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పంట చేతికొచ్చే సరికి ధరలు తగ్గు ముఖం పట్టేవి. ఒక్కో సందర్భంగాలో టన్ను రూ. 8 వేల నుంచి రూ. 12 వేలకు మించి ఉండేది కాదు. కొన్నేళ్లుగా ధరలు లేకపోవడంతో అరటి సాగుపై పెద్దగా రైతులు దృష్టి పెట్టలేదు. మండలం వ్యాప్తంగా 250 ఎకరాల్లో అరటి సాగైంది. ఈ ఏడాది ధరలు బాగుండటం సాగు విస్తీర్ణం పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. . ఒక ఎకర అరటి సాగు కోసం రూ.లక్ష నుంచి రూ. లక్షన్నర వరకు పెట్టుబడి ఖర్చు అవుతుంది. ఎకరాకు 20 నుంచి 30 టన్నులు వరకు దిగుబడి వస్తుంది. ఏదేమైనా ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు సంతోషం చెందుతున్నారు. కరోనా మహమ్మారి తర్వాత ఆశించిన ధరలు పెరగడం ఇదే ప్రథమం అని రైతులు అంటున్నారు.



కూనవారిపల్లె వద్ద సాగులో ఉన్న అరటి పంట

జాతీయ రహదారి స్థలంలో నిర్మాణాలు



చాపాడు వద్ద రోడ్డు స్థలంలో చేపడుతున్న నిర్మాణాలు

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు మండల కేంద్రంలోని మైదుకూరు - ప్రొద్దుటూరు జాతీయ రహదారిలో ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. 12 ఏళ్ల కిందట రోడ్డు విస్తరణలో స్థలం, ఇల్లు కోల్పోయిన వారికి రెవెన్యూ అధికారులు రెండు ధపాలుగా పరిహారం అందించారు. ప్రస్తుతం ప్రభుత్వ అధీనంలో ఉన్న స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలం వరకూ ఎలాంటి అక్రమ నిర్మాణాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు పేర్కొన్నారు. ఇప్పటికే జాతీయ రహదారి పై పలు రకాలైన రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇలాంటి నిర్మాణాల వల్ల మరిన్ని రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటాయని, అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను అరికట్టాలని కోరారు.

శిల్పారామంలో దసరా సంబరాలు



పులివెందులలో చిన్నారుల దసరా వేషధారణ



కడపలో చిన్నారుల నృత్యం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక శిల్పారామంలో దసరా సంబరాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పశ్చిమ రాయలసీమ పట్ట భద్రుల శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, భాను ప్రకాష్ జ్యోతి ప్రజ్వలన చేసి, దుర్గామాత పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసన మండలి సభ్యులు రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ శిల్పారామం పులివెందుల ప్రాంత ప్రజలకు ఆటవిడుపుగా ఎంతో ఆహ్లాదాన్ని అందిస్తోంది అని పేర్కొన్నారు. శిల్పారామం మరింత అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. దసరా సంబరాలు మొదటి రోజు మదనపల్లికి చెందిన సూర్య డ్యాన్స్ అకాడమీ, సూర్య మాస్టర్, ఉషా జ్యోతి ఆధ్వర్యంలో జానపద, శాస్త్రీయ నృత్యం ప్రేక్షకులను అలరించింది. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో ప్రేక్షకులను అలరించారు. ఎఒ సుధాకర్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

కడప శిల్పారామంలో..

కడప అర్బన్ : శిల్పారామంలో దసరా పండుగ సందర్భంగా చిన్నారులు ఆటపాటలతో ప్రేక్షకులను అలరించారు. శుక్రవారం శిల్పారామం వేదికపై సినీ, జానపద, శాస్త్రీయ గీతాలకు డాన్స్ చేశారు. కార్యక్రమాలను శిల్పారామం ఏవో శివప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు.

తల్లిదండ్రులను విస్మరించరాదు

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు



అన్నం వడ్డిస్తున్న న్యాయవాది

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పిల్లలు చక్కగా చూసుకోవాలని, వారిని విస్మరించరాదని న్యాయవాది సుమంత్ కుమార్ తెలిపారు. ఆయన తల్లి చంద్ర లీలమ్మ వర్ధంతి సందర్భంగా వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులైన తల్లిదండ్రులను ఆదరించాలని తిరిగి ఈ చర్య నేటి పిల్లలు వృద్ధులైన అనంతరం పునరావృతం అవుతుంది అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బాలాజీ మస్తాన్ దినేష్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - పులివెందులటౌన్



దుస్తులు, పండ్లు పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

విభిన్న ప్రతిభావంతుల పిల్లలు వైసిపి నాయకులు దుస్తులు పంపిణీ చేశారు. శుక్రవారం ముద్దనూరురోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో కడప పార్లమెంటు సభ్యుడు వై.ఎస్.అవినాష్ రెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా వైసిపి నాయకులు కేక్ కట్ చేసి విభిన్న ప్రతిభావంతులకు అందించారు. అనంతరం ఎంపీ అభిమానులు సమకూర్చిన దుస్తులను 30 మందికి పంపిణీ చేశారు. స్వీట్లు, పండ్లు అందించారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, పౌరసరఫరాల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ హాలు గంగాధర రెడ్డి, ఎంపీ వ్యక్తిగత కార్యదర్శి రమణారెడ్డి, హరి, కౌన్సిలర్ కోడి రమణ, యూత్ లీడర్ కనక, వికలాంగుల సంఘ నాయకులు వెంకటసుబ్బయ్య, సునీల్, బషీర్, వేణు, మహమ్మద్ పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీవారి రథోత్సవం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రమైన సింహాద్రిపురంలో శ్రీవారి రథోత్సవం కన్నులు విందుగా సాగింది. శుక్రవారం దసరా వేడుకలు ఘనంగా ఆలయ నిర్వాహకులు నిర్వహించారు. ఆలయ అర్చకులు హరి ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వారి రథోత్సవం అంగళ్ళ బజార్ మీదుగా బైపాస్ రోడ్డు వెంబడి సన్నాయి మేళం కోలాటలా నడుమ భారీ జన సందోహం నడుమ కదిలింది. రథోత్సవం వెంబడి విచిత్ర వేషధారణలు ఎంతో ఆకట్టుకున్నాయి. నూతన రథంలో శ్రీ దేవీ భూదేవి సమేత శ్రీ వెంకతేశ్వర స్వామిని సుందరంగా అలంకరించారు. అంతకుముందు అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

లక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు

చెన్నూరు : శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం 9వ రోజు అమ్మవారిని శ్రీ మహాలక్ష్మి దేవి , శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శ్రీ గాయత్రీ దేవి రూపాల్లో అలంకరించారు. శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో ఉదయం అమ్మవారికి శ్రీ గణపతి పూజ అభిషేక పూజలు కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉట్టి కొట్టు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అనేకమంది తమ ప్రతిభ చూపించారు. అలంకార ఉభయ దారులు .ప్రసాదం ఉభయ దారులు. ఇళ్ల దగ్గర నుంచి తీర్థ ప్రసాదాలను భాజా భజంత్రీల మధ్య ఊరేగింపుగా చౌడేశ్వరి దేవి ఆలయం వరకు వచ్చారు. అమ్మవారిని దర్శించుకునే భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయం 9:30 గంటలకు మహర్నవమి నిర్వహించారు. చండీ హోమం, మహా పూర్ణవతి. మధ్యాహ్నం 12 గంటలకు కన్యకల పూజ వేద పండితుల చేతుల మీదుగా నిర్వహించారు. రాత్రి శ్రీ గాయత్రీ దేవి అలంకారాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



వెండి కవచం అందజేస్తున్న దాతలు

అమ్మవారికి వెండి కవచం బహూకరణ

ప్రజాశక్తి-చెన్నూరు

స్థానిక శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి(కోట్ల స్వామి) ఆలయంలోని అమ్మవారికి 2.5 కిలోల వెండి కవచం, బంగారు కన్నులు సమర్పించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పెడబల్లె వీరారెడ్డి తెలిపారు. చెన్నూరుకు చెందిన చల్లా యశోదమ్మ, సుబ్బారెడ్డి కుమారులు చల్లా శ్రీహరి రెడ్డి, సతీమణి శ్రీలక్ష్మి, రెండవ కుమారుడు చల్లా చంద్రశేఖర్ రెడ్డి, సతీమణి రాధిక, వారి కుటుంబ సభ్యులు సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ అమ్మవారికి దాదాపుగా 2,50,000 విలువగల వెండి, బంగారు వస్తువులు సమర్పించారని చెప్పారు.ఇలా దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించడం సంతోషకరమని తెలిపారు. దాతలకు వారి కుటుంబ సభ్యులకు లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి, అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అమర్,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకృష్ణ గీతాశ్రమము, ప్రొద్దుటూరు

ప్రకటన

దేవాదాయశాఖ శ్రీకృష్ణగీతాశ్రమము, ప్రొద్దుటూరు నందు శ్రీనామా ఎరుకలయ్య శ్రీమతి నామా కమలాక్షమ్మగారి ఆరాధన ఉత్సవాలు 31.10.2024 నుండి 9.11.2024 వరకు 10రోజుల పాటుగా జరుపవలెనని నిశ్చయించడమైనది. ఈ కార్యక్రమానికి ఆశ్రమ ప్రాంగణంలో ఎకరా విస్తీర్ణంలో పైపు పందిర్లు, షామియానాలు ఏర్పాటు చేయుటకు అన్నదానము రోజుకు 400 మందికి మొదలగు వాటికి ఆసక్తి గల వారి నుండి కొటేషన్లు 18.10.2024వ తేది సాయంత్రం 5.00 గంటలలోపు కార్యనిర్వహణాధికారి కార్యాలయం, శ్రీకృష్ణ గీతాశ్రమము నందు అందజేయాలని తెలుపడమైనది.

కె.రామచంద్రాచార్యులు, M.A.,B.Ed.,
ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,
శ్రీకృష్ణగీతాశ్రమము, ఎండోమెంట్ డిపార్టుమెంట్,
ప్రొద్దుటూరు టౌన్, వైయస్ఆర్ జిల్లా.

IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE: KADAPA

O.S.NO. 498 /2024

Reddannagari Samba Siva Reddy alias Yeturu Samba Siva Reddy S/o Gangi Reddy aged about 74 years, Retired Employee, R/at D.No.41/97-10-3-1, Bharathibar Street, Sankarapuram, Kadapa.
...Plaintiff

Versus

G.Gurumurthy, S/o G.Muni Swami, Working as Police constable,P.C.No.2071 ChinnaChowk Police station, Kadapa-516002. Cell:.7013884958.
...Defendant

NOTICE TO DEFENDANT

Whereas the above plaintiff filed the above suit against you for recovery of amount due. If the defendant got any objections he has to appear before the Hon'ble court at10:30 AM on 17/10/2024 failing which the matter will be decided ex-parte.

N. VENKATA PRASAD,
M.B.A., LL.B.,
Advocate,
KADAPA. Cell: 8686889695.



టిడిపి నాయకులకు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు


ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో టిడిపి యువ నాయకుడు, కడప యోగానంద రెడ్డి అనంతపురంలోని ప్రముఖ కిమ్స్ సవేరా హాస్పటల్ సంయుక్తంగా ఉచిత గుండె వైద్యపరీక్షల శిబిరం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని టిడిపి వేముల మండల ఇన్‌ఛార్జి మారెడ్డి జోగిరెడ్డి, టిడిపి పులివెందుల పట్టణ మాజీ అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. మొత్తం 200 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు, బిపి, ఇసిజి, 2డి- ఎకో, 2డి స్కానింగ్ వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. వీరిలో ఆరోగ్యం సమస్యలు ఎక్కువ ఉన్న వారిని అనంతపురంలోని కిమ్స్ సవేరా హాస్పిటల్‌కు ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నట్టు డాక్టర్ రామ్ కుమార్ తెలిపారు. అనంతరం టిడిపి వేముల మండల నాయకులు మాట్లాడుతూ కిమ్స్ సవేరా హాస్పిటల్ వారు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం గొప్ప విషయం అని అన్నారు. కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన నల్లపురెడ్డి పల్లె టిడిపి నాయకులు నంద్యాల జయరామి రెడ్డి, యువ నాయకులు కడపన యోగానంద రెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం ఆంజనేయులు, వేముల మండలం వెలుగు సిసి కోనా హరికృష్ణ, జయరాంరెడ్డి, మస్తాన్, శివగంగాధర, ఓబులేసు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చలేని ప్రభుత్వం

ప్రజాశక్తి - వేముల



మాట్లాడుతున్న ధృవకుమార్‌రెడ్డి

ఎన్నికల ముందు ప్రజలకు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోకపోవడం శోచనీయమని పులివెందుల కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మూలం ధ్రువ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వేములలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి పార్టీ పటిష్టతపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలుపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ పాలనలో నిలిచిన అభివృద్ధి పనులను కూడ వేగవంతం చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. పులివెందుల నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగే విధంగా టిడిపి నేతలు దృష్టి పెట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చేందుకు కాంగ్రెస్ నేతలు అందరూ కూటమి ప్రభుత్వం చేస్తున్న వైఫల్యాలను ప్రజలకు తెలియ జేసి వారిని చైతన్య వంతులను చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నేరవేర్చకపోతే ప్రజలతో కలిసి టిడిపి, బిజెపి పార్టీ కార్యాల యాలను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. పిసిసి ఛీఫ్ షర్మిల, పిసిసి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి, డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి ఆధ్వ ర్యంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికులుగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో వేముల నాయకులు మాబు, సాధకబీ పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో 'పుట్టా'


ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం: పలుగురాళ్లపల్లె పంచాయతీలోని పి కొత్తపల్లి గ్రామంలో వెలసిన శ్రీ దుర్గాంబ అమ్మవారిని శుక్రవారం దసరా మహోత్సవాలలో భాగంగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. వేద పండితులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ నాయకులకు శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా బండలాగుడు పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, సాంబశివారెడ్డి, ఎస్సార్ శ్రీనివాసుల రెడ్డి, పోల్ రెడ్డి, పూజ శివయ్య యాదవ్, సుధాకర్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ఖాజీపేట : మండలం పరిధిలోని కడప - కర్నూలు జాతీయ రహదారిపై కూన వారి పల్లె సమీపంలో శుక్రవారం బొలెరో వాహనం ఆకస్మాత్తుగా అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకొచ్చింది. మైదుకూర నుంచి కడపకు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. కూరగాయలు, నూనె డబ్బాల లోడ్‌తో వాహనం ప్రయాణిస్తుంది. వాహనం అదుపు తప్పడంతో సరుకులన్నీ రోడ్డుపై చెల్లా చెదురుగా పడ్డాయి. కొందరు నూనె డబ్బాలను అపహరించకపోయారు. ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదు.

ప్రయివేట్ బస్సుల దోపిడీని అరికట్టాలి

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు : ప్రయివేట్ బస్సుల దోపిడీని ఆర్‌టిఎ అధికారులు అరికట్టలేకపోతున్నారని సిపిఎం కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాదు,బెంగుళూరు, విజయవాడ నుండి ఒక్కొక్కరికి రూ.1500 మొదలుకొని రూ.3000 వరకు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతూ ఉంటే అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు అని విమర్శించారు. ప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటూ వారి కోసం అధికారులు పనిచేయక పోవడం బాధాకరం అన్నారు. ఈ దోపిడి చాలదు అన్నట్లు లగేజీ కూడా పరిమితికి మించి వేస్తున్నారని అన్నారు. ఇలాంటి లగేజీల వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. జరగరానిది ఏదైనా జరిగితే అప్పుడు బాధ్యత ఎవరిదని ఆయన సూటిగా ప్రశ్నించారు. సమావేశంలో సిపిఎం శాఖ కార్యదర్శి లక్ష్మయ్య, శివ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

FORM NO. 14 [See Regulation 33(2)]
By Regd. tuD, Dastifailing which by Publication.

OFFICE OF THE RECOVERY OFFICER - I/IIDEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT 2)
1st Floor, Triveni Complex Abids, Hyderabad 500001

DEMAND NOTICE

NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961.

RC/306/2020 **01-10-2024**

Indian Overseas Bank
Versus
Sri Sai Minerals and Others

To
(CD 4) Mr. Chapalamadugu Uma Maheswar Rao, S/o Late C. Siddaiah, R/o D. No. 3-120-1-2, Kuchivaripalli, Obulavaripalle Mandal Kadapa, Cuddapah, Andhra Pradesh -516002
(CD 5) Smt. Chapalamadugu Jyothi, Wo Mr. Ch. Uma Maheswar Rao, R/o D. No.26-36-1779,7th Cross Road, C. M Nagar, Kadapa, Cuddapah, Andhra Pradesh -516002

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 2) in **OA/132/2019** an amount of **Rs 25267483.30 (Rupees Two Crore Fifty Two Lakhs Sixty Seven Thousands Four Hundred Eighty Three And Paise Thirty Only)** along with pendentellite and future interest @ 11% Simple Interest Yearly w.e.f. 25-01-2019 till realization and costs of Rs 190655 (Rupees One Lakh Ninety Thousands Six Hundred Fifty Five Only) has become due against you (Jointly and severally/ Fully/Limited).

2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.

3. You are hereby ordered to declare on an affidavit the on or before the next date of hearing.

4. you are hereby ordered to appear before the undersigned on **05/11/2024** at 10:30 a.m. for further proceedings.

5. In addition to the sum aforesaid, you will also be liable to pay:
(a) Such interests as is payable for the period commencing immediately after this notice of the certificate / execution proceedings.
(b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and warrants and otier processes and all other proceedings taken for recovering the amount due.

Given under my hand and the seal of the Tribunal, on this date: **01-10-2024**

Sd/- Recovery Officer,
Debts Recovery Tribunal, Hyderabad (DRT-1)